andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.5 : కనిష్ఠం 23.8
నిర్మల్ జిల్లా వార్తలు
8
బుధవారం 30 అక్టోబరు 2024

ప్రభుత్వమే పదవీ విరమణ మహోత్సవాలను నిర్వహించాలి

నిర్మల్ అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వమే తన ఖర్చులతో పదవీ విరమణ మహోత్సవాలు నిర్వహించాలని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షులు ఎస్.భూమన్న యాదవ్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రియదర్శిని నగర్ అంగ్ల ఉపాధ్యాయులు గంగన్న డేవిడ్ పదవీ విరమణ మహోత్సవం సందర్భంగా మాట్లాడారు. ఉపాధ్యాయులు జీవితకాలం కృషి చేసి పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసి, సేవలు చేసినందుకు గాను ప్రభుత్వమే తన ఖర్చులతో పదవీ విరమణ మహోత్సవాలు నిర్వహించాలన్నారు. వారికి రావలసిన అన్ని బెనిఫిట్స్ సకాలంలో అందించాలన్నారు. ఉపాధ్యాయులకు రావలసిన అన్ని సదుపాయాలను, బకాయిలను సకాలంలో చెల్లించాలి.

లైసెన్స్ లేకుండా
బాణాసంచా దుకాణాలు పెట్టొద్దు

ముథోల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో దీపావళి పండుగను పురస్కరించుకొని బాణాసంచా (పటాకులు) విక్రయించేవారు తప్పకుండా లైసెన్స్ తీసుకోవాలని తహసీల్దార్ శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. టపాసుల దుకాణం పెట్టదలచిన వారు టపాసుల దుకాణం నిర్వహించేందుకు తప్పకుండా లైసెన్స్ తీసుకొని టపాసుల దుకాణాలు పెట్టుకోవాలన్నారు. లైసెన్స్ లేకుండా విక్రయిస్తే చట్ట రీత్యా చర్యలు తప్పవన్నారు.

నిధులు విడుదల చేయాలని ధర్నా

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ట్రైకా నిధులు రూ.265 కోట్లు విడుదల చేయాలని కోరుతూ మంగళవారం తెలంగాణ గిరిజన సమాఖ్య కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించింది.

కడెం ప్రాజెక్టుకు తప్పనున్న పూడికముప్పు

- తొలగింపునకు సర్కారు గ్రీన్‌సిగ్నల్
- ఎగువ నుంచి మట్టి, బురద రూపంలోకి రిజర్వాయర్‌లోకి చేరిక
- లెక్క తప్పుతున్న నీటి నిల్వ సామర్థ్యం
- హైడ్రాలజీ సర్వే కీలకం





కడెం ప్రాజెక్టు మట్టితో పూడిక నిండిపోయిన దృశ్యం (ఫైల్)

నిర్మల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని కడెం ప్రాజెక్టు పూడిక సమస్యకు ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చూపబోతుంది. ఈ ప్రాజెక్టులోని పూడికను తొలగించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల ఇక్కడి రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది. కాగా.. ఈ ప్రాజెక్టులోకి ఎగువ నుంచే కాకుండా అటవీప్రాంతంలోని వాగుల నుంచి భారీ ఎత్తున బురద మట్టి, చెత్తాచెదారం పూడికరూపంలో వచ్చి చేరుతోంది. దీంతో ఈ ప్రాజెక్టు రిజర్వాయర్ నీటి సామర్థ్యం లెక్కలు గతి తప్పుతున్నాయని నీటిరంగ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రాజెక్టు గరిష్ఠ నీటి నిల్వసామర్థ్యం 7.603 టీఎంసీలు కాగా కింది నుంచి దాదాపు రెండు టీయంసీల సామర్థ్యం వరకు పూడిక ఉండవచ్చని చెబుతున్నారు. ముఖ్యంగా ఎగువన గల చిక్‌మాన్ వాగు నుంచి ప్రతీఏటా వర్షకాలంలో బురదతో పాటు నల్లమట్టి, ఇతర చెత్తచెదారం వరదరూపంలో ప్రాజెక్టు రిజర్వాయర్‌లోని వచ్చి చేరుతోంది. ఇలా ఏటేటా పూడిక పెరుగుతుండడంతో రిజర్వాయర్‌లోని నీటినిల్వ సామర్థ్యం తగ్గిపోతుందని నిపుణులు పేర్కొంటున్నారు. దీంతో వరదల సమయంలో దిగువకు నీటిని విడుదల చేసే అంశంపై కూడా గందరగోళ పరిస్థితులు ఏర్పడుతున్నాయంటున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే కడెం ప్రాజెక్టుపై ప్రత్యేకఫోకస్ పెట్టింది. ముఖ్యంగా ఈ ప్రాజెక్టును జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్కతో పాటు మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు పలుసార్లు సందర్శించి దీనిని కాపాడే విషయంపై దృష్టి కేంద్రీకరించారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే వెడ్మబొజ్జు సైతం కడెం ప్రాజెక్టు దుస్థితిని ఎప్పటికప్పుడు సర్కారు దృష్టికి తీసుకుపోయి నిధుల మంజూరు కోసం పట్టు పట్టారు. ఇందులో భాగంగానే ప్రభుత్వం రూ.5 కోట్లను విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ నిధులతో కౌంటర్ వెయిటర్లు, గేట్ల మరమ్మతులు, పూర్తిస్థాయిలో ఆధునీకరణ పనులన్నింటిని విజయవంతంగా పూర్తి చేశారు.

కడెంకు వరంగా మారనున్న సర్కారు నిర్ణయం

ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రాజెక్టుల్లోని పూడికను తొలగించేందు కోసం చర్యలు చేపట్టాలని నిర్ణయించడం కడెం ప్రాజెక్టుకు వరంగా మారబోతోంది. మొట్ట మొదట కడెం ప్రాజెక్ట్ పూడికతీతను ప్రయోగాత్మకంగా చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించిన కారణంగా ఈ ప్రాజెక్ట్ పూడిక సమస్యకు శాశ్వత పరిష్కారం లభించబోతోందంటున్నారు. రిజర్వాయర్ నుంచి తొలగించిన పూడికను నల్లమట్టిగా అలాగే ఇసుకగా వేరు చేసి వ్యవసాయానికి, నిర్మాణాలకు వేరు వేరుగా వినియోగించాలని భావిస్తున్నారు.

ఫారెస్ట్ క్లియరెన్స్ ఆటంకాలపై అనుమానాలు

కాగా కడెం ప్రాజెక్టు ప్రాంతమంతా కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలో ఉన్న కారణంగా ఈ ప్రాజెక్ట్ నుంచి పూడిక తొలగించే పనులకు అటవీ, పర్యావరణ శాఖ క్లియరెన్స్‌లు తప్పనిసరి. అయితే ఈ ప్రాజెక్టులో పూడిక తీతకు సంబంధించి పర్యావరణశాఖ అనుమతులు తప్పనిసరి కాదంటూ కేంద్ర పర్యావరణ శాఖ గైడెన్స్ జారీ చేసిందని దీని కారణంగా కడెం ప్రాజెక్టులో పూడిక తొలగింపు పనులకు ఎలాంటి ఆటంకాలు ఏర్పడబోవని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇదిలా ఉండగా పూడిక తొలగింపు పనులు పూర్తయితే చివరి ఆయకట్టు వరకు కూడా సాగునీరు అందించే అవకాశాలు ఏర్పడాయని అంటున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా 63వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలని లక్ష్యంగా ఉన్నప్పటికి ప్రాజెక్ట్ రిజర్వాయర్‌లోని పూడికతో పాటు ఈ ప్రాజెక్టు కాలువలలో సిల్ట్ పేరుకుపోవడం, గండ్లు పడుతుండడం లక్ష్యం నెరవేరడం లేదు.

హైడ్రాలజీ సర్వే కీలకం

కాగా కడెం ప్రాజెక్టులో ఎంత మేరకు పూడిక చేరుకుందోననే అంశం హైడ్రాలజీ శాఖ ద్వారా జరిగే సర్వే నిర్ధారణ చేయనుంది. ఇప్పటికే రాష్ట్ర ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు, హైడ్రాలజీ విభాగం అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం అనంతరం ఫిబ్రవరి లేదా మార్చి నెల నుంచి పూడిక చేపట్టే అవకాశాలుంటాయని అంటున్నారు. బ్యాక్ వాటర్ వైపు నుంచి క్రమంగా పూడికను తొలగించే అవకాశాలుంటాయి. క్రమంగా మే వరకు మొత్తం పూడికను తొలగించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే ఈ పూడికను ప్రాసెసింగ్ చేసి ప్రాజెక్టు నుంచి మట్టి, ఇసుకను వేరు చేయనున్నారు. ఇటు మట్టిని రైతులకు, ఇసుకను నిర్మాణాలు చేపట్టే వ్యాపారులకు తక్కువ ధరలకే విక్రయించాలని భావిస్తున్నారు.

హరిహర క్షేత్రంలో ప్రత్యేక పూజలు

- ఆలయంలో అన్న ప్రసాద వితరణ



హరిహర క్షేత్రంలో అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మల్లన్న గుట్ట హరిహర క్షేత్రంలో మంగళవారం గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాహు కేతు దోషమున్న వారు ప్రతీ మంగళవారం ఆలయంలో పూజలు చేయించుకోవడం ఆనవాయితీ. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా ధర్మకర్తలు అల్లోల వినోదమ్మ, మురళీధర్‌రెడ్డి, గురుస్వామిమూర్తి అన్ని ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి సామల వేణుగోపాల్‌రెడ్డితో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా గోపూజ మహోత్సవం



ఖానాపూర్‌లో గోవుకు పూజలు చేస్తున్న భక్తులు

ఖానాపూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పద్మావతి నగర్‌లో గల లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం గోపూజ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు అడ్డగట్ల రాజన్న మాట్లాడుతూ... గోవత్స ద్వాదశిని పురస్కరించుకొని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గోపూజ మహోత్సవాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. గోపూజ మహోత్సవంలో భాగంగా గోవుకు నూతన వస్త్రాలతో, పూలతో అలంకరణ చేసి, ప్రదక్షిణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోవత్స ద్వాదశి రోజు మాత్రమే కాకుండా ఆవును నిత్యం సరక్షించడం, వాటిని ప్రతీఇంటా పెంచడం ఎంతో పుణ్యాన్ని కలిగిస్తుందని ఆలయ పూజారి నిమ్మగడ్డ సందీప్ భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బృందంతో పాటు భక్తులు పాల్గొన్నారు.

ఖానాపూర్, సత్తనపెల్లి పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో
ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

ఖానాపూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ ప్రాంతంలో విద్యుత్ ఆధారిత వ్యవసాయ క్షేత్రాల్లో వేసిన వరిపంట ముందస్తుగానే చేతికి అందిందని సదరు రైతుల సౌకర్యార్థం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ఈ నెల 27వ తేదీన ఆంధ్రజ్యోతిలో 'ముమ్మరంగా వరి కోతలు' అనే శీర్షికన ప్రచురితమైన కథనంపై అధికార యంత్రాంగం స్పందించింది. మంగళవారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్ ఆవరణలో ఖానాపూర్ పీఏసీఎస్ అధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంతో పాటు మండలంలోని సత్తనపెల్లి గ్రామంలో సత్తనపెల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, పీఏసీఎస్ చైర్మన్లు సత్యనారాయణ రెడ్డి, ఆమంద శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్ పాల్గొన్నారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్లను ఆదేశించిన మంత్రులు, సీఎస్




వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న విద్యా, వైద్యోగ, ఆర్థిక, సామాజిక, రాజకీయ, కుల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిల్లా కలెక్టర్లు, అధికారులను ఆదేశించారు. మంగళవారం పలువురు మంత్రులతో కలిసి సమగ్ర ఇంటింటి సర్వేపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ... అధికార యంత్రాంగం సమన్వయంతో సర్వే పూర్తి చేయాలన్నారు. మంత్రులు పొన్నం, ఉత్తంకుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వర్‌రావు, సీతక్క ఆర్థిక కుటుంబ సర్వే పారదర్శకంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఇప్పటికే జిల్లాకు ఐదుగురి చొప్పున 240 మందికి హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చినట్టు చెప్పారు. జిల్లా, మండల స్థాయి అధికారులకు శిక్షణలు నిర్వహించాలన్నారు. సర్వే కోసం నియమితులైన ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన కుటుంబాల వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. సమయానుసారంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి ఒక్క ఎన్యుమరేటర్ 150 నుండి 175 కుటుంబాలు సర్వే చేయాలన్నారు. సూపర్‌వైజర్లు 10 శాతం ర్యాండమ్‌గా పరిశీలించాలన్నారు. సర్వే వివరాలు ఎప్పటికప్పుడు ప్రణాళిక శాఖకు అందించాలన్నారు. సర్వే కోసం కుటుంబాలు ఆధార్, రేషన్‌కార్డులు, ధరణి పట్టా పాస్ పుస్తకాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. దీనిపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో సమగ్ర సర్వే విధివిధానాలు తెలిపారు. నవంబరు 1 నుండి నిర్వహించే సర్వే లోటు పాట్లు లేకుండా చేయాలన్నారు. బుధవారం కలెక్టర్ సమావేశ మందిరంలో సర్వే నిర్వహణపై శిక్షణ ఇస్తామన్నారు. తరువాత మండల స్థాయి అధికారులకు శిక్షణ ఉంటుంద న్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్, కిషోర్‌కుమార్, ప్రణాళిక అధికారి జీవరత్నం పాల్గొన్నారు.

మారుమూల ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు

- పెంబిలో ప్రభుత్వ ఆసుపత్రి ప్రారంభోత్సవానికి హాజరైన ఎంపీ గోడం నగేష్, కలెక్టర్ అభిలాష అభినవ్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



ప్రభుత్వ ఆసుపత్రిని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే



పాఠశాల ప్రహరీ గోడకు భూమి పూజ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

పెంబి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని, మారుమూల ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పంచాయతీ రాజ్ శాఖ ద్వారా 1 కోటీ 56 లక్షలతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని కలెక్టర్ అభిలాష అభినవ్, ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ... ఆరోగ్యమే మహాభాగ్యమని పెంబి మండలంలోని మారుమూల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని ప్రారంభించుకోవడం సంతోషమని, నూతనంగా ఏర్పడిన పెంబి మండలంలో విద్యా, వైద్యం, రవాణా సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, జూనియర్ కళాశాల మంజూరుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. మారుమూల ప్రాంతాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ... నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ మారుమూల గిరిజన ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందించాలని సూచించారు. వైద్యసిబ్బంది అందుబాటులో ఉంటూ మారుమూల గిరిజన ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందించాలని సూచించారు. మారుమూల గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి గర్భిణీలు, బాలింతలకు ప్రత్యేక వైద్య చికిత్సలు అందించాలని సూచించారు. అధికారులు, సిబ్బందితో సమన్వయంతో పని చేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ... ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామని, మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్యకేంద్రం భవనంలో అధునాతన వైద్య సదుపాయాలు కల్పిస్తామన్నారు. అలాగే సబ్‌సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పాఠశాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి విద్యార్థుల రక్తనమూనాలు సేకరించి హెల్త్ ప్రొఫైల్ తయారు చేయడం జరుగుతుందన్నారు. గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు రహదారి సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటా మన్నారు. అంతకుముందు ముఖ్య అతిథులకు గ్రామస్థులు పూల మొక్కలను అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్, డీఈవో రవీందర్‌రెడ్డి, పంచాయతీ రాజ్ ఈఈ నర్సయ్య, ఈఈపీఆర్ శంకరయ్య, వైద్యులు శివ, శాంతన్, ఎంపీ డీవో రమాకాంత్, ఎంఆర్‌వో లక్ష్మణ్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు స్వప్నిల్, బీజేపీ మండల అధ్యక్షులు ఐదు వెంకటేష్, మున్సిపల్ చైర్మన్ సత్యం, తాజా మాజీ సర్పంచ్ శేఖర్‌గౌడ్, సీఐ సైదారావు, ఎస్సై సాయి, వీడీసీ అధ్యక్షులు పుప్పాల నర్సయ్య, మాజీ ఎంపీపీ సల్ల రామేశ్వర్‌రెడ్డి, నాయకులు గోవింద్, ఆకుల శ్రీనివాస్, తులాల శంకర్, రమేష్, కాంట్రాక్టర్ అంగ చిన్నయ్య, అధికారులు, వైద్య సిబ్బంది, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు
ఎంపికైన ముథోల్ విద్యార్థి



ముథోల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : క్రీడా సమాఖ్య నిర్మల్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వడ్యాల్ నందు ఈ నెల 28న జరిగిన అండర్-17 బాలికల కబడ్డీ జోనల్ స్థాయి సెలక్షన్స్‌లలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముథోల్ విద్యార్థిని ఏ. సరయు పదో తరగతి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ శ్రీనివాస్ తెలిపారు. వచ్చే నెల నవంబరు 3వ తేదీ నుంచి మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. విద్యార్థిని ఎంపిక పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డుప్రమాదంలో
ఒకరికి తీవ్రగాయాలు

భైంసా, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణ సరిహద్దులోని ఎస్ఆర్ఆర్ ఫంక్షన్‌హాల్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్వర్ణకార సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు కలికోట రాములు (70) తీవ్ర గాయాలపాలయ్యాడు. ఉదయం వేళలో వ్యక్తిగత పనుల నిమిత్తం భైంసా నుంచి మాటేగామ్ వైపు బైక్‌పై వెలుతున్న కలికోట రాములుకు వెనుకవైపు నుంచి వచ్చిన అర్‌టీసీ బస్సు ఢీకొట్టుకోవడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఘటనలో కలికోట రాములు బైక్ నుంచి కింద పడటంతో తల, భుజం భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని ప్రమాదస్థలి నుంచి వైద్యసేవల నిమిత్తం ఇక్కడి ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్సలు నిర్వహింప చేశారు. భైంసా బస్సు డిపో అధికారులు ఘటన స్థలిని పరిశీలించి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు కలికోట రాములును పరామర్శించారు.

గిరిజన తండావాసులు
అప్రమత్తంగా ఉండాలి

సారంగాపూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇప్పచెలమే, ఆదివాసిగూడ లక్ష్మీనగర్ గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారి నజీర్‌ఖాన్ అన్నారు. మంగళవారం మండలంలో గల గిరిజన తండాలలో నివసిస్తున్న గిరిజనులకు సహ్యాద్రి కొండల్లో సంచరిస్తున్న పులిపై అవగాహన కల్పించారు. గత వారం రోజుల నుండి సహ్యాద్రి కొండల్లో సంచరిస్తున్న పులిని పట్టుకోవడానికి మంగళవారం టైగర్ మానిటరింగ్ నాలుగు బృందాలుగా గాలింపు చర్యలు చేపట్టగా, బోథ్, ఇప్పచెలమే సరిహద్దుల్లో పెద్ద పులిపాద ముద్రలు లభించినట్లు తెలిపారు. దీంతో సహ్యాద్రి కొండల సమీపంలో నివసిస్తున్నటువంటి ప్రజలు తగు జాగ్రత్తలు పాటిస్తూ ఉండాలని పేర్కొన్నారు. ఈ గాలింపు చర్యల్లో అటవీశాఖ అధికారులు ఇర్ఫాన్, రాజశేఖర్, అర్షద్, స్వప్న, స్రవంతి, అలీం, రాజాసింగ్‌లు ఉన్నారు.


ఎంపీ గోడం నగేష్‌ను సన్మానిస్తున్న క్రీడా సంఘాల నాయకులు

ఆదిలాబాద్‌ను ఆటల జిల్లాగా చేస్తా : ఎంపీ

ఆదిలాబాద్ రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్‌ను ఆటల జిల్లాగా తీర్చిదిద్దేదుకు తనవంతు కృషి చేస్తానని ఎంపీ గొడం నగేష్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల స్పోర్ట్స్, యూత్ ఆఫైర్స్‌లో సభ్యుడిగా ఎంపీని నియమించడంతో మంగళవారం ఆయా క్రీడ సంఘాల నాయకులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఎంపీ సన్మానించి క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్పోర్ట్స్ అండ్ యూత్ ఆఫైర్స్‌లో సభ్యుడిగా తనను నియమించిందన్నారు. జిల్లాలో క్రీడాలను మరింత ప్రోత్సహించేలా కృషి చేస్తానన్నారు. ఖేలో ఇండియా ఆదిలాబాద్ ఎంపిక అయ్యిందని, హాకీ సింథటిక్ మ్యాట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నామన్నారు. కార్యక్రమంలో గిరిజన క్రీడాల అభివృద్ధి అధికారి పార్థసారథి, ఆయా సంఘాల ప్రతినిధులు బాలూరి గోవర్ధన్ రెడ్డి, రాష్ట్రపాల్, రఘుపతి, నడిమేల హరిచరణ్, ఎస్‌జీఎస్ కార్యదర్శి కాంతరావ్, స్వామి, రాకేష్, జ్యోతి స్వారన్ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్ రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని చాంద క్రికెట్ మైదానంలో పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం అండర్-14, 17 ఏళ్ల విభాగం బాల బాలికల అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. ముఖ్యఅతిథులుగా జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి హాజరై మాట్లాడారు. అథ్లెటిక్స్ అనేది వ్యక్తిగత క్రీడ అని, పోటీల్లో సత్తా చాటిన వారే రాణిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో చాంద మాజీ సర్పంచ్ భాస్కర్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కాంతారావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌లో మూడోస్థానం

ఆదిలాబాద్ రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి పోటీల్లో భాగంగా తెలంగాణ విద్యా పరిశోధక మండలి నిర్వహించిన రాష్ట్రస్థాయి సెమినార్‌లో ఆదిలాబాద్ జిల్లాకు మూడోస్థానం దక్కింది. 'కృత్రిమ మేధస్సు సామర్థ్యాలు, సందేహాలు' అనే అంశంపై హైదరాబాద్‌లోని ఎస్‌సీఈఆర్టీలో మంగళవారం జరిగిన సెమినార్‌లో అన్ని జిల్లాల నుంచి విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభ పాటవాలు ప్రదర్శించారు. కాగా ఈ పోటీల్లో పట్టణంలోని సెయింట్ జోసెఫ్ కాన్వెంట్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని సాన్వి మూడోస్థానంలో నిలిచింది.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

గుడిహత్నూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంకేంద్రం సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళా మృతి చెందినట్లు ఎస్సై సయ్యద్ ఇమ్రాన్ తెలిపారు. ఇచ్చోడ మండలంలోనరి కోకస్ మన్నూర్‌కు చెందిన జాదవ్ మధుకర్, జాదవ్ రమ్య అనే దంపతులు మోటార్ సైకిల్‌పై ఆదిలాబాద్ వైపు వెళుతున్నారు. వారి మోటార్ సైకిల్ వెనుక నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు వారిని వెంటనే 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. వైద్యులు పరీక్షించగా అప్పటికే జాదవ్ రమ్య(30) మృతి చెందినట్లు తెలిపారు. ఆమె భర్తకు తీవ్ర గాయాలు కాగా చికిత్స పొందుతున్నాడు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కారును ఢీకొట్టిన ట్రాక్టర్

బోథ్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బైపాస్ రోడ్డు వద్ద ఆదివారం సాయంత్రం రోడ్డుపైనున్న రెండు కార్లను ట్రాక్టర్ ఢీకొట్టింది. సంఘటనలో కార్లు కొంతమేర డ్యామేజ్ అయినట్లు తెలిసింది. అయితే ట్రాక్టర్ నడుపుతున్నది మైనర్ కావడంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ సైతం లేకపోవడం వల్ల కేసును బయటకు పక్క నివ్వలేదు. అయితే ట్రాక్టర్ యజమాని కార్ల యజమానులకు రూ.లక్షా 85 వేల వరకు నష్ట పరిహారం చెల్లించినట్లు సమాచారం.

మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి

- 'వండిందే మెనూ.. పెట్టిందే తిను' అనే కథనానికి స్పందించిన ఐసీడీఎస్ పీడీ
- పలువురు అంగన్‌వాడీ టీచర్లకు మెమోలు


రాంపూర్‌గూడలో రికార్డులను పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీడీ మిల్కా


సిరికొండ రైతు వేదికలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ విమల

సిరికొండ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ పీడీ మిల్కా అన్నారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'వండిందే మెనూ.. పెట్టిందే తిను' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి సంబంధితశాఖ జిల్లా అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీడీ మిల్కా, సూపర్‌వైజర్ శారదతో కలిసి మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. విధులకు డుమ్మాకొట్టిన టీచర్లకు, మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించని టీచర్లకు మెమోలు జారీ చేశారు. ఐసీడీఎస్ పీడీ మిల్కా మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్‌లు సమయపాలన పాటించాలని అన్నారు. విధులకు డుమ్మా కొట్టినా, మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించేందుకు వండిన ఆహార పదార్థాలను, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రీ స్కూల్ పిల్లలకు నేర్పుతున్న ఆటపాటలను పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను తనిఖీ చేసి పిల్లలకు పరిశుద్ధమైన పౌష్టికాహారాన్ని క్రమంతప్పకుండా సరఫరా చేయాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పాలు, గుడ్లు, సంపూర్ణ పోషకాహారం మెనూ ప్రకారం అందించడంతోపాటు వారికి ఇమ్యునైజేషన్, నెలవారీగా ఆరోగ్య పరీక్షలు చేస్తూ, అవసరమైన మందులు సరఫరా చేయాలని ఆమె ఆదేశించారు.

● చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

ప్రతీ అంగన్‌వాడీ టీచర్ సమయపాలన పాటించడంతో పాటు చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని వాయిపేట్ సెక్టార్ సూపర్‌వైజర్ విమల అన్నారు. వాయిపేట్ సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్‌లతో మంగళవారం మండలకేంద్రంలోని రైతు వేదికలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ టీచర్ తమ విధులను సక్రమంగా నిర్వహించాలని, మెనూ ప్రకారం గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు. ప్రతీ కేంద్రంలో రిజిష్టర్ అయిన 0-5 ఏళ్ల పిల్లలకు ప్రతీ నెల ఎత్తు, బరువులు రికార్డు చేయాలన్నారు. బలహీన చిన్నారులకు అదనంగా ఆహారం అందించాలన్నారు. ప్రభుత్వం అందించిన ఫోన్లలో పకడ్బందీగా పిల్లల హాజరును నమోదు చేయాలన్నారు.

క్రికెట్ లీగ్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే

ఆదిలాబాద్ రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): క్రీడలతో శారీరక ధృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం పెంపొందుతుందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. జైనథ్ మండలకేంద్రంలోని అతి పురాతన ఆలయమైన లక్ష్మీనారాయణ స్వామి జాతర సందర్భంగా జైనథ్ ప్రీమియర్ క్రికెట్ లీగ్ పోటీలు సందర్భంగా మంగళవారం పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. దీనిలోభాగంగా ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకొని ఉత్సాహ పరిచారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన క్రీడాకాంలు రాష్ట్రస్థాయిలో రాణించాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆదినాథ్, రాందాస్, అశోక్ రెడ్డి, రమేష్ రెడ్డి, ప్రతాప్ ముకుంద్, అశోక్, బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


ఆదివాసీలతో కలిసి నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్

● దండారీ ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

దీపావళి పండగను పురస్కరించుకొని ఆదివాసీలు జరుపుకునే దండారి ఉత్సవాలకు ఎంతో ప్రాధాన్యత ఉందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. దండారి ఉతవాల్లో భాగంగా బేల మండలంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఆదివాసీ సంప్రదాయం ప్రకారం ఎమ్మెల్యేకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే పాయల శంకర్ గుస్సాడీ టోపీ ధరించి దండారి నృత్యాలు చేస్తూ ఉత్సాహపరిచారు. గుస్సాడి బృందానికి ఆర్థిక సహకారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దత్త నిక్కం రాకేష్, మోరేశ్వర్, గణేష్, నవీన్, శ్రీకాంత్, గంభీర్, హరీశ్ రాము, తదితరులు పాల్గొన్నారు.

● ఎమ్మెల్యే సమక్షంలో బీజేపీలో చేరికలు

బేల మండలంలోని మసాలా గ్రామాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. బేల మండలంలోని మసాలా గ్రామ మాజీ సర్పంచ్ ప్రజలు బీజేపీ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి బీజేపీ కండువా కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పత్తి రైతుల పరేషాన్!

(5వ పేజీ తరువాయి...)

దిగుబడులు ఆశాజనకంగానే కనిపిస్తున్నా.. ఖర్చు భారం పెరిగిపోవడంతో ఆదాయంపై ఆశలు వదులుకుంటున్నారు. కొందరు రైతులైతే ఇతర ప్రాంతాల నుంచి తమ బంధువులను పిలిపించుకుని పత్తి ఏరే పనులను పూర్తి చేసుకుంటున్నారు.

● కూలీల కోసం ఇబ్బంది పడుతున్నాం

: గవ్వల దత్తు, పిప్పల్‌కోటి, భీంపూర్ మండలం



పత్తి ఏరేందుకు కూలీలు దొరక్క పోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. గత్యంతరంలేక మహారాష్ట్రకు వెళ్లి కూలీలను తీసుకొచ్చుకునే పరిస్థితి ఏర్పడుతోంది. కూలి అధికమైనా.. చెల్లించక తప్పడం లేదు. ఎందుకంటే పత్తి ఏరేందుకు అదునుదాటి పోతోంది. మరింత ఆలస్యమైతే పంట చేతికొచ్చే పరిస్థితి ఉండదు. కూలీలు, పెట్టుబడి ఖర్చులు పోగా.. అంతంతమాత్రంగానే ఆదాయం వస్తోంది. పంటలు పండించడం ఒక్కెత్తయితే.. పంట ఇంటికి చేరేంత వరకు పరేషాన్ కావాల్సి వస్తోంది.


మున్సిపల్ కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

పట్టణంలో ఇబ్బందులు లేకుండా చర్యలు

● నూతన మున్సిపల్ కమిషనర్ సీవీఎస్ రాజు

ఆదిలాబాద్ రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్యంపై ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ సీవీఎస్ రాజు అన్నారు. నిర్మల్ నుంచి బదిలీపై వచ్చిన ఆయన మంగళవారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నూతన బాధ్యతలు చేపట్టిన కమిషనర్ మాట్లాడుతూ పట్టణ పరిస్థితులపై తనకు అవగాహన ఉందన్నారు. పారిశుధ్య నిర్వహణకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపిక

తలమడుగు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని బరంపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు గుర్నులే వంశీ అండర్-17 విభాగంలో మెరుగు అర్పిత్, అండర్-14 విభాగంలో సంగారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా నుంచి ఎంపిక అయినట్లు పీడీ రవీందర్ జాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రత్యూష ప్రత్యేకంగా అభినందించారు. వీరి వెంట ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, ప్రవీణ్, శశికళ ఉన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఏబీవీపీ ధర్నా

ఆదిలాబాద్ రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట విద్యార్థులతో కలిసి నాయకులు ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో జిల్లా కన్వీనర్ అక్షయ్, నగర కార్యదర్శి కార్తీక్, నిఖిల్, మహేష్, సంజయ్, ఆదిత్య, రుతిక్, సాయి, ఆశ్విత, శ్రావణి పాల్గొన్నారు.

ఖైదీల కుటుంబ సభ్యుల వివరాలపై కలెక్టర్ ఆరా

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఎంపవర్మెంట్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. జిల్లాలోని జైళ్లలో పలు కేసుల్లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీల సమాచారం వారి కుటుంబ వివరాలు అడిగి తెలుసుకున్నారు. బెయిల్ పొందడానికి అర్హత ఉన్నప్పటికీ బెయిల్‌కు సంబంధించిన పూచికత్తు చెల్లించే ఆర్థిక స్థోమత లేని వారి సమాచారం అధికారులను అడిగారు. అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, ఎంపవర్మెంట్ కమిటీ సభ్యురాలు రాధిక, డీఎస్పీ గంగారెడ్డి, జైలు సూపరిండెంట్ చిరంజీవి, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గోవత్స ద్వాదశి వేడుకలు


భైంసాలో గోమాతకు పూజలు చేస్తున్న భక్తులు

భైంసా, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 29 : పట్టణంలోని మహిళలు మంగళవారం గోవత్స ద్వాదశి వేడుకలను భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఉదయం వేళలో కొంత మంది మహిళలు గోశాలలకు, ఇంకొంత మంది మహిళలు తమ తమ ఇళ్లకు గోవులను తీసుకవెళ్లి పూలతో వాటికి శోభయామానంగా ఆలంకరించి నైవేద్యాలు సమర్పించారు. గోవుల చుట్టూ ప్రదక్షిణలు చేసి తమ కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాల కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోవులకు భక్తిశ్రద్ధలతో హరతులు అందించారు.

4న మీసేవ ఆవిర్భావ దినోత్సవం


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మీసేవ వ్యవస్థ ఆరంభమై 14 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నవంబరు 4న ఆవిర్భావ దినోత్సవాన్ని హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు మీసేవ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పవన్‌కుమార్ తెలిపారు. మంగళవారం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు హాజరవుతున్నట్లు తెలిపారు. మీ సేవ యాజమాన్యాలు తప్పనిసరి పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మీడియా ప్రతినిధి కే. వేణుగోపాల్, జలాల్, కరుణాకర్, జిశాన్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

దిలావర్‌పూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని న్యూ లోలం, దిలావర్‌పూర్ గ్రామాల్లో ఎఫ్ఎస్‌సీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమన్ అలీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. మధ్య దళారులకు ధాన్యం అమ్ముకుని నష్టపోవద్దని సూచించారు. నిర్వాహకులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్లు డి. సాయన్న, రాజలింగం, రైతులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను సకాలంలో వసూలు చేయండి

● నిర్మల్ జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్


గ్రామపంచాయతీ సిబ్బందితో మాట్లాడుతున్న డీపీవో

కుభీర్, అక్టోబరు 29 : మండలంలోని గ్రామాల్లో బాకాయి పడ్డ ఇంటి పన్ను సకాలంలో వసూలు చేసి పంచాయతీ అభివృద్ధికి పాటు పడాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని కుభీర్ గ్రామ పంచాయతీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. గ్రామపంచాయతీకి రావాల్సిన బకాయి పడ్డ పన్నులను గడువులోపల వసూలు చేయాలని పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్‌కు సూచించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో మండల కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్య వ్యవస్థ మెరుగు పరచి తాగు నీటి ట్యాంకులో వారానికోసారి బ్లీచింగ్ చేయాలని సూచించారు. గ్రామాల్లో మరుగుదొడ్లు లేని నివాసాలను గుర్తించి వారు మరుగుదొడ్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో సుదర్శన్ ఎంపీడీవో నవనీత్‌కుమార్, ఎంపీవో మోహన్‌సింగ్, పంచాయతీ కార్యదర్శులు తదితరులున్నారు.

అన్నదాతల సంక్షేమానికి కృషి

భైంసా, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికబద్దమైన విధానాల ద్వారా అన్నదాతల సంక్షేమానికి బాధ్యతాయుతో కృషి చేస్తానని భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ సిందే ఆనంద్‌రావ్ పాటిల్ పేర్కొన్నారు. మంగళవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మిర్జాపూర్ పీఏసీఎస్ చైర్మెన్ అమేడ దేవేందర్ రెడ్డితో పాటు పలు సంఘాల ప్రతినిధులు మార్కెట్ కమిటీ పాలక వర్గ ప్రతినిధులను సన్మానించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మార్కెట్ కమిటీ పరిధిలో క్రయ,విక్రయాల నిమిత్తం వచ్చే అన్నదాతలకు ఎలాంటి కష్టనష్టాలు కలుగనీయకుండా చర్యలు చేపడుతానని వెల్లడించారు. ధరల్లో దగా, తూకాల్లో మోసాలకు తావులేకుండా వ్యవహరిస్తానని స్పష్టం చేశారు. మార్కెట్ పరిధిలో ఎలాంటి సమస్యలు ఏర్పడిన తమ దృష్టికి తీసుకవస్తే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మెన్ దేవేందర్ రెడ్డి, కార్యదర్శి వడ్నపు రాజేందర్, సిబ్బంది శ్రావణ్‌లతో పాటు పలు సంఘాల ప్రతినిధులు మార్కెట్ కమిటీ చైర్మెన్ సిందే ఆనంద్‌రావ్ పాటిల్, వైస్ చైర్మెన్ ఫారుఖ్ అహ్మద్, పలువురు డైరెక్టర్లను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు బహుకరించారు.


పాలకవర్గ ప్రతినిధులను సన్మానిస్తున్న పీఏసీఎస్ చైర్మెన్ దేవేందర్‌రెడ్డి

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి


ప్రహరీ క్లబ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

ముథోల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రమశిక్షణతో చదువుతూ తల్లిదండ్రులు కన్నకలలను సహకారం చేయాలని ఏఎస్సై సాహెబ్‌రావు అన్నారు. మండలంలోని మచ్కల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రహరీక్లబ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మత్తు పదార్థాల వలన యువత ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. మద్యం, డ్రగ్స్ నుంచి యువతను ఎలా కాపాడుకోవాలో విలువైన సలహాలు, సూచనలు ఇచ్చారు. విద్యార్థులు ఎలాంటి మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా ఉండాలన్నారు. వ్యసనాలకు బానిసై బంగారు జీవితం నాశనం చేసుకోకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎండీ మోహిదుద్దీన్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగాధర్, పోలీసు సిబ్బంది రాజారాం, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వానొస్తే లోలెవల్ వంతెనలతో ఇబ్బందులు

తలమడుగు అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలతో రోడ్ల నిర్మాణం చేపడుతున్నప్పటికీ వంతెన నిర్మాణం కోసం నిధులు కేటాయించకపోవడంతో లో లెవల్ వంతెనలతో ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలో సుంకిడి నుంచి తలమడుగు మండల కేంద్రానికి రావాలంటే మూడు లోలెవల్ వంతెనలు ఉండటంతో ప్రయాణీకులకు, వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఏచిన్న వర్షం కురిసిన లోలెవల్ వంతెనపై నుంచి పొంగిపొర్లడంతో రాకపోకలకు ఇబ్బంది తప్పడం లేదు. హై లెవల్ వంతెన నిర్మాణం కోసం అధికారులు నాయకులు హామీలు ఇస్తున్నారు తప్ప ఇప్పటి వరకు ఎలాంటి నిధులు కేటాయించలేదు. కేవలం ప్రతిపాదనలకే పరిమితమవుతున్నాయని విమర్శలు వ్యక్తం అవుతుఅన్నాయి. గత వర్షాలు కురిసిన భారీ వర్షాలకు లో లెవల్ వంతెనలు పొంగిపొర్లిపోవడంతో గంటల తరబడి వాగు వద్ద నిరీక్షణ చేయవలసిన పరిస్థితి ఏర్పడ్డాయి. ముఖ్యంగా మండల కేంద్రానికి అనుకొని ఉన్న పెద్ద వాగు వద్ద ప్రతి సంవత్సరం ప్రయాణీకులకు ఇబ్బందులు తప్పడం లేదు. కాగా ఇటీవల జిల్లాలోని ఆయా గ్రామాలకు వంతెన నిర్మాణం కోసం నిధులు మంజూరైనప్పటికీ తలమడుగు మండలానికి ఒక వంతెన నిర్మాణం కోసం నిధులు మంజూరు కాకకపోవడం పట్ల మండల వాసులు అసంతృప్తిగా ఉన్నారు.


డీమార్ట్‌లో కాలం చెల్లిన నెయ్యి అమ్మకం

● తనిఖీల్లో గుర్తించిన అధికారులు

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : డీమార్ట్‌లో సోమవారం రాత్రి ఫుడ్ ఇన్స్‌పెక్టర్ ప్రత్యూష ఆకస్మిక తనిఖీ చేపట్టగా కాలం చెల్లిన నెయ్యి గుర్తించారు. పలు సరుకులను తనిఖీ చేశారు. కొన్ని ఆహార పదార్థాలు నాణ్యత లోపించినట్లు తెలిపారు. వాటిని స్వాధీనం చేసుకొని ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. వినియోగదారులు ఆహార పదార్థాలు, సరుకుల తయారు, గడువు తేదీలను పరిశీలించాలని సూచించారు. డి మార్ట్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమానం ఉంటే తమకు సమాచారం అందించాలన్నారు.

మున్సిపల్ కమిషనర్‌ను

కలిసిన ఎంఐఎం నాయకులు


కమిషనర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ మున్సిపల్ నూతన కమిషనర్ ఎంఏ ఖమర్‌ను ఎంఐఎం నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆయనకు అభినందనలు తెలిపి పుష్పగుచ్ఛం అందజేశారు. కౌన్సిలర్ ముజాహిద్ అలీ, నాయకులు రఫీక్ అహ్మద్ ఖురేషి, సయ్యద్ అజారుద్దీన్, ముషీరుద్దీర్, తదితరులు పాల్గొన్నారు.

ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా కొవ్వొత్తుల ర్యాలీ


దిలావర్‌పూర్‌లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్థులు

దిలావర్‌పూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఇథనాల్ పరిశ్రమ నిర్మాణానికి వ్యతిరేకంగా మంగళవారం రాత్రి దిలావర్‌పూర్ గ్రామస్థులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పుచప్పుళ్లతో కొవ్వొత్తులతో గ్రామస్థులు ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో గ్రామ యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

...పాదయాత్ర

దిలావర్‌పూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) ఇథనాల్ పరిశ్రమ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ దిలావర్‌పూర్ గ్రామస్తులు మంగళవారం కాల్వ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం వరకు పాదయాత్ర చేశారు. రిలేనిరాహారదీక్షలు చేపట్టి వందరోజులు పూర్తయినా అధికారుల్లో చలనం లేదని ఇథనాల్ పరిశ్రమ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు పేర్కొన్నారు. అధికారులకు, యాజమాన్యానికి బుద్ధిని ప్రసాదించి ఇథనాల్ పరిశ్రమ రద్దయ్యేలా చూడాలని కాల్వ లక్ష్మీ నరసింహస్వామిని మొక్కుకున్నట్లు చెప్పారు. అనంతరం దీక్ష శిబిరం వద్ద వంటావార్పు నిర్వహించారు. త్వరలో ఆమరణ నిరాహార దీక్షలు చేపడతామని వెల్లడించారు. ఉమ్మడి మండలంలోని గ్రామాలన్నింటిని పోరాటంలో భాగస్వామ్యం చేస్తామన్నారు.

మొక్కజొన్న పంటకు మార్కెటింగ్ కరువు!

- అయోమయంలో ఆదిలాబాద్ జిల్లా రైతులు
- వ్యాపారుల దోపిడీ



మొక్కజొన్న తోట





మొక్కజొన్న పంటను ఆరబోస్తున్న రైతులు

ఉట్నూర్, అక్టోబరు29: జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల రైతులు పండిస్తున్న మొక్కజొన్న పంటకు మార్కెటింగ్ సౌకర్యం లేక పోవడంతో రైతులు కష్టాలకు గురవుతున్నారు. వర్షాధార పంటలపై ఆధారపడి దశాబ్దాలుగా వ్యవసాయం చేస్తున్న రైతులు గత కొన్నేళ్లుగా సాగునీటి సౌకర్యాలు అందుబాటులోకి వచ్చిన రైతులు మాత్రం తమకు ఉన్న వ్యవసాయ భూముల్లో పంట మార్పిడీ విధానం పాటిస్తూ మొక్కజొన్న పంటను సాగు చేయడం ఆరంభించారు. తక్కువ కాలంలో ఎక్కువ లాభాలు ఇస్తున్న పంటకు మార్కెటింగ్ సౌకర్యం లేక పోయినా పెరటి తోటలోకి వచ్చి వ్యాపారులు మొక్కజొన్న కంకులను కొనుగోలు చేస్తూ పట్టణ మండల కేంద్రాలలో కాల్చి అమ్మడం ప్రారంభించిన వ్యాపారులు మొక్కజొన్న కంకులను కొనుగోలు చేయడంతో రైతులకు గిట్టుబాటు అయింది. అయినప్పటికీ కొందరు రైతులు కంకులకు బదులు మొక్కజొన్నలు విక్రయిం చాలని భావించి ఆరబెట్టి వ్యాపారులకు అమ్ముకుంటే మరింత ధర వస్తుందని ఆశపడుతున్నారు. మొక్కజొన్న కోళ్ల దాణ కోసం కూడా వ్యాపారులు ఇళ్ల వద్దకే వచ్చి పంటలు కొనుగోలు చేస్తూ ఉన్నప్పటికీ రైతులు నష్టపోతున్నారు. దీంతో రైతులు వరి ధాన్యం కొనుగోలు చేస్తున్న మాదిరిగానే మొక్కజొన్న పంటను కూడా మార్కెటింగ్ అధికారులు కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

• కొనుగోలు కేంద్రాలు లేక అవస్థలు

ఏజెన్సీ ప్రాంతాల రైతులు పండించిన మొక్కజొన్న పంటను అమ్ముకోవడానికిరైతులు మార్కెటింగ్ కోసం ఎదురు చూస్తున్నారు. అకాల వర్షాలు ఇబ్బంది పెడుతున్నాయని రైతులు వాపోతున్నారు. ఏజెన్సీలోని రైతులు ఈసారి అధికంగా మొక్కజొన్న సాగుపై ఆసక్తి చూపించారు. ఉట్నూర్ మండలంలో 2962 ఎకరాలలో, నార్నూర్ మండలంలో 1737 ఎకరాలలో, ఇంద్రవెల్లి మండలంలో 2982 ఎకరాలలో, గాదిగూడ మండలంలో 535 ఎకరాల్లో సుమారు ఏజెన్సీ డివిజన్‌లో 4670 ఎకరాల వరకు రైతులు మొక్కజొన్న పంట సాగు చేశారు.

• దళారుల దోపిడీ?

ఏజెన్సీ ప్రాంతాల రైతులు పండించిన మొక్కజొన్న పంటకు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు సౌకర్యం ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవడంతో రైతులను దళారులు దోచుకుంటున్నారు. బహిరంగ మార్కెట్లో 2,300 వరకు ధర ఉన్నప్పటికీ వ్యాపారులు 1400 నుంచి 1800 వరకు క్వింటా ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ప్రతీ రైతు క్వింటాకు 300 నుంచి 400 వరకు నష్టపోతున్నట్లు అవగతం అవుతోంది. ఇప్పటికైనా మార్కెటింగ్ అధికారులు రైతుల కష్టాలను దృష్టిలో పెట్టుకొని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు మేలు చేయాలని, వ్యాపారుల దోపిడీ అరికట్టాలని రైతులు కోరుతున్నారు.



రైతులు ఆరబెట్టిన మొక్కజొన్న పంట

కొనుగోళ్లకు ఏర్పాట్లు చేస్తాం

• ఎస్పీ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్, ఉట్నూర్



జైనూర్ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో హస్నాపూర్ సబ్ మార్కెట్ కేంద్రంగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి కృషిచేస్తాం. రైతులు తమ పంటలను దళారులకు అమ్మి మోసపోవద్దు.

మార్కెట్‌కు దీపకాంతులు!

- ఆకట్టుకుంటున్న ప్రమిదలు
- వివిధ డిజైన్‌లో మట్టి దీపాలు
- డిజైన్లను బట్టి ధరలు



ఆకట్టుకుట్టున్న వివిధ రకాల ప్రమిదలు

నేరడిగొండ అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వెలుగుల పండుగ దీపావళికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచేవి ప్రమిదలు. కట్లను పారద్రోలి కోటి కాంతులు వెదజల్లేవి ఈ మట్టిదీపాంతలు. దీపావళి పండుగ నేపథ్యంలో వీటి విక్రయాలు మండలంలో ఊపందుకున్నాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. వివిధ డిజైన్లతో తయారు చేసిన ఈ మట్టిప్రమిదలు మహిళలను ఎంతగానో ఆకర్శిస్తున్నాయి. దీపావళి పండుగలో ప్రమిదలకు ప్రత్యేక స్థానం ఉంది. ఈ పండుగను ఇంటిల్లిపాది దీపాలతో ఆకర్శించడం ఆనవాయితీగా వస్తోంది. రానున్న దీపావళి పండుగను పురస్కరించుకుని మండలంలో ప్రమిదల దుకాణాలు వెలిసాయి. ప్రతీ ఏడాది వివిధ డిజైన్‌లలో దీపావళి ప్రమిదలు అందుబాటులోకి వస్తున్నాయి. మండల కేంద్రంలో వీటిని విక్రయిస్తూన్నారు.

వివిధ రాష్ట్రాల నుంచి డిజైన్ ప్రమిదల దిగుమతి..

కొంతమంది ప్రమిదల విక్రయ దుకాణం దారులు కొన్ని రకాల ప్రమిదలను ఇక్కడే తయారుచేసి విక్రయిస్తూండగా.. కొంత మంది వివిధ డిజైన్ల మట్టి ప్రమిదలను తమిళనాడు, రాజస్థాన్‌ల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. ఎంతో ఆకర్షణీయమైన రూపాల్లో ప్రమిదలు అందుబాటులో ఉన్నాయి. ప్రమిదలను వాటి పరిమాణం. డిజైన్‌ను బట్టి విక్రయిస్తున్నారు.

జోరుగా జీరో వ్యాపారం!

- ఇతర జిల్లాల నుంచి ధాన్యం తరలింపు
- రాత్రిపూట తరలిస్తున్న ధాన్యం పట్టివేత

బోథ్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో జీరో వ్యాపారం జోరుగా సాగుతోంది. మండలంలోని వ్యాపారులు ఇతర జిల్లాల రైతుల వద్ద కొనుగోలు చేసి ఆ ధాన్యాన్ని రాత్రిపూట తరలిస్తున్నారు. మార్కెట్ ఆదాయానికి గండి కొడుతూ కొనసాగుతున్న ఈ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుంది. ఫలితంగా మార్కెట్ ఆదాయానికి లక్షల్లో నష్టం వాటిల్లుతోంది.

• నిఘా లోపం

మండలంలోని వివిధ గ్రామాల నుంచి రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యం లారీలలో నింపి పంపిస్తున్న మార్కెటింగ్ శాఖ నుంచి నిఘా వేయాల్సిన అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో విచ్చలవిడిగా జీరో వ్యాపారం కొనసాగుతోంది. అయితే నిఘా వేయాల్సిన సిబ్బంది తీరుపై మార్కెట్ కమిటీ కార్యదర్శిని వివరణ కోరగా.. మహిళా అధికారి ఉండటంతో కొంత ఇబ్బంది అవుతుందని అయినా తమ సిబ్బందితో పర్యవేక్షిస్తున్నామన్నారు.

• అక్రమ వ్యాపారంపై చైర్మన్ నిఘా

మండలంలో అక్రమంగా ధాన్యం తరలిస్తున్నారన్నసమాచారంతో మార్కెట్ కమిటీ చైర్మన్ నిఘాపెట్టారు. మార్కెట్ కమిటీ ఆదాయాన్ని సమకూర్చాలని దృక్పథంతో సమాచారం వచ్చిన వెంటనే వాహనాలను పట్టుకుని మార్కెట్ ఫీజు వసూలు చేస్తున్నారు. సోమవారం రాత్రి పొచ్చెర క్రాస్‌రోడ్డు వద్ద అక్రమంగా తరలిస్తున్న మూడు లారీల ధాన్యాన్న పట్టుకుని మార్కెట్ యార్డుకు తరలించారు. అయితే కొంత మంది దళారీలు దాడులకు సైతం వెనకాడవటం లేదని తనకు సెక్యూరిటీ అవసరం ఉంటుందని అన్నారు. ఈ విషయాన్ని స్థానిక పోలీసుల దృష్టికి తీసుకువెళ్లామని పేర్కొన్నారు. కాగా సోమవారం రాత్రి పట్టుకున్న ధాన్యం లారీల సమాచారాన్ని స్థానిక ఎస్సైకి వివరించడంతో ఆయన సైతం రంగంలోకి దిగి వాహనాలను పట్టుకున్నారు.



జర దేఖో!!



మార్కెట్ ఫీజు చెల్లించకుండా తరలిపోతున్న పట్టుబడిన ధాన్యం లారీలు

ఫొటో న్యూస్



ప్రధాన రహదారి.. ప్రమాదకరంగా మారి!

జాతీయ రహదారి అంటేనే వాహనాలు సురక్షితంగా సులభంగా వెళ్తుంటాయి. కానీ జిల్లా మీదుగా వెళ్తున్న 44వ జాతీయ రహదారి మాత్రం ప్రమాదకరంగా మారింది. ఇచ్చోడ నుంచి పెన్‌గంగా వరకు అనేకచోట్ల గుంతలు పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. పలు ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల మరమ్మతులు చేపట్టేందుకు అక్కడక్కడ రోడ్డును తవ్వేసి గీతలు పెట్టారు (మార్కింగ్) దీంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, ఇతర వాహనాలు కుదుపునకు గురవుతు న్నాయి. ఉదయం పూట ఇవి కనిపిస్తున్నా రాత్రివేళల్లో అంతగా కనిపించడం లేదు. దీంతో అనేకమంది ప్రమా దాల బారీన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మరమ్మతు పనులు పూర్తి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

• (ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్ స్టాఫ్, ఫొటోగ్రాఫర్)






మరమ్మతు పనులు పూర్తి చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

రైతు సమాచారం



సోయా దిగుబడులను ఆరబెడుతున్న రైతులు



భైంసా మండలం మాటేగాంలో నాబార్డు నిధులతో నిర్మించిన గోదాము

అవగాహన లోపం.. వినియోగానికి దూరం

- వ్యవసాయోత్పత్తుల విక్రయాల్లో అన్నదాతలకు తప్పని ఇబ్బందులు
- పంట ఉత్పత్తులను నిల్వ చేసుకోలేని దుస్థితి
- పట్టించుకోని అధికారులు

భైంసా, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): దేశానికి అన్నం పెట్టే రైతు పంటల సాగుకు నానా అవస్థ పడుతున్నాడు. ఆరు గాలం చెమటోడ్చి పండించిన పంటను విక్రయించుకోవడానికీ అవస్థే.. మార్కెట్ యార్డుల్లో కనీస సదుపాయాల్లేని దైన్యం... ఉన్న గోదాముల్లో ధాన్యం నిలువ చేసుకోలేని పరిస్థితి రైతు ఎదుర్కొంటున్నారు. గోదాములు నిరుపయోగంగా మారినా అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు.

• వ్యవసాయమే ప్రధాన ఆధారం

ఇక్కడి ప్రజల జీవనోపాధికి వ్యవసాయమే ప్రధాన ఆధారం. వ్యయ, ప్రయాసాలను ఎదురుదీతూ కష్ట, నష్టాలను అధిగమిస్తూ రైతాంగం సాగుబడి చేస్తూ ఆశాజనకంగా పంటలు పండిస్తున్నారు. అయితే దిగుబడుల నిల్వలు, విక్రయాల ప్రక్రియలో అన్నదాతలు అగచాట్ల పాలవుతున్నారు. సరియైన వసతులు, సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు మార్కెట్‌లో ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టకపోవడంతో ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలకు వ్యవసాయోత్పత్తులు తడిసిపోతున్నాయి. దీంతో రైతన్నలకు కష్టనష్టాలు తప్పడం లేదు.

• గోదాముల వినియోగంపై కొరవడిన అవగాహన

రైతులు తాము పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర లేనప్పుడు ధాన్యాన్ని నిల్వ చేసుకోవడానికి ప్రభుత్వం గోదాముల నిర్మించింది. జిల్లాలో నాబార్డు నిధుల ద్వారా 10, మార్కెటింగ్ నిధుల ద్వారా 21 కలిపి మొత్తం 31 గోదాములున్నాయి. వీటిన్నింటిలో 79 వేల మెట్రిక్ టన్నుల వ్యవసాయోత్పత్తులను నిల్వ చేసుకునేందుకు వీలు ఉంది. గిట్టుబాటు ధర లేనప్పుడు గోదాముల్లో వ్యవసాయోత్పత్తులను నిల్వ చేసుకొంటే అన్నదాతకు రైతుబంధు పథకం కింద పంట ఉత్పత్తుల విలువలో 75శాతం రుణసదుపాయం కూడా కల్పిస్తారు. దిగుబడులను అమ్ముకొన్న తరువాత ఆ రుణం చెల్లించవచ్చు అయితే గోదాముల వినియోగంపై రైతుల్లో అవగాహన లేకపోవడంతో నిర్మించిన నాటి నుంచి అవి నిరుపయోగంగానే ఉన్నాయి. రైతులు మాత్రం మార్కెట్‌కు తెచ్చిన వ్యవసాయోత్పత్తులను ధర లేకున్నా వచ్చినకాడికి అమ్ముకొని పోతున్నారు.

• అవగాహన లోపంతోనే సమస్యలు

జిల్లా రైతాంగానికి గోదాముల వినియోగానికి సంబంధించి ఎలాంటి అవగాహన లేకుండా పోయింది. ఇటు వ్యవసాయాధికారులు, అటు మార్కెటింగ్ అధికారులు రైతులకు అవగాహన కల్పించడంతో, చైతన్యపరచడంలో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో రైతులు గోదాములను వినియోగించుకోవడం లేదు. ఫలితంగా ప్రకృతి పరిహారం చేసిన సందర్భంలో అగచాట్ల పాలవుతున్నారు.



వానల్‌పాడ్‌లో మార్కెటింగ్ నిధులతో నిర్మించిన గోదాము

ప్రచారం కల్పిస్తాం

• (సిందే ఆనంద్‌రావ్ పాటిల్, చైర్మన్ ఏఎంసీ ,భైంసా)



వ్యవసాయోత్పత్తులను గోదాములలో నిల్వగా ఉంచి రైతు బంధు ద్వారా రుణం తీసుకునే విధానాలపై ప్రచారం చేస్తాం. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల సమన్వయంతో వ్యవహరించి రైతులను చైతన్యపరుస్తాం.

నేడు కొమురంభీం విగ్రహావిష్కరణ

భీంపూర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో నూతనంగా నిర్మించిన ఆదివాసీల ఆరాధ్య దైవం కొమురం భీం విగ్రహాన్ని బుధవారం ఉదయం 11.30 గంటలకు ఆవిష్కరిస్తామని ఆదివాసీ నాయకులు కుడిమేత సంతోష్, మడావి లింబాజీ, సీడం పురుషోత్తంలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, ఆదిలాబాద్, బోథ్ ఖానాపూర్, ఆసిఫాబాద్, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, అనిల్ జాదవ్, వెడ్మ బొజ్జు పటేల్, కోవ లక్ష్మీ, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, అలాగే మహారాష్ట్ర క్వినట్ ఎమ్మెల్యే కేరం భీంరావులు హాజరవుతారని వారు పేర్కొన్నారు.

• పత్తి ఏరుతున్న రైతు కూలీలు



పత్తి రైతుల.. పరేషాన్!

- జిల్లాలో ఏకకాలంలో చేతికొచ్చిన పంట.. పత్తి ఏరేందుకు కూలీల కొరత
- కూలీల కోసం మహారాష్ట్ర బాట పడుతున్న రైతులు
- రవాణా చార్జీలు, అడ్వాన్సులతో అదనంగా ఆర్థిక భారం
- పెరిగిపోతున్న పెట్టుబడి ఖర్చులతో అన్నదాతల ఆందోళన
- జిల్లావ్యాప్తంగా ఈయేడు మొత్తం 4లక్ష 34వేల ఎకరాల్లో సాగైన పత్తి పంట

ఆదిలాబాద్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అష్టకష్టాలు పడి పంటను పండించినా.. తీవ్రమైన కూలీల కొరతతో గ్రామాల్లో పత్తి రైతులు పరేషాన్ అవుతున్నారు. అసలు పంట చేతి కొచ్చిన సమయంలోనే కూలీలు దొరక్క పోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలో ప్రధానంగా సాగయ్యే పత్తి పంట ఈ యేడు జిల్లావ్యాప్తంగా 4లక్ష 34వేల ఎకరాలలో సాగైంది. దీంతో ఈసారి 30లక్షల క్వింటాళ్లకు పైగా పత్తి దిగుబడులు వస్తాయని మార్కెటింగ్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. వాణిజ్య పంటగా చెప్పుకునే పత్తి పంటపై జిల్లా రైతులు భారీ ఆశలు పెట్టుకుంటున్నారు. దీర్ఘకాలిక అప్పులను తీర్చే పంటగా పేరున్న పత్తి దిగుబడుల పైననే భరోసా పెట్టుకుంటున్నారు. జిల్లా అంతటా ఏకకాలంలోనే పంట చేతికి రావడంతో గ్రామీణ ప్రాంతాల్లో కూలీల కొరత తీవ్రమవుతోంది. ఉదయం నుంచి రాత్రి వరకు చిన్నాపెద్ద అనే తేడా లేకుండా కుటుంబ సమేతంగా పత్తి చేలలోనే బిజీబిజీగా గడుపుతున్నారు. సకాలంలో పత్తిని తీయకుంటే నలుపు భారీ నాణ్యతను కోల్పోతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే శీతాకాలం ప్రారంభం కావడంతో రాత్రి వేళల్లో విపరీతంగా కురుస్తున్న పొగ మంచుతో పత్తి బుగ్గలు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.

మహారాష్ట్ర కూలీలే ఆధారం

స్థానికంగా కూలీలు దొరక్క పోవడంతో పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర కూలీల పైననే ఆధారపడాల్సి వస్తోంది. పత్తిని తీసేందుకు ఇప్పటి వరకు ఎలాంటి యంత్ర పరికరాలు అందుబాటులోకి రాకపోవడంతో కూలీల అవసరం తప్పనిసరిగా మారింది. మహారాష్ట్ర సరిహద్దు గ్రామాలైన కిన్వట్ తాలుకా మాండ్వి, బెల్లూరు, బోదిడి, పిప్పల్‌గావ్, సాంగిడి, ఉద్దీర్, పటాన్‌బోరి, పాండ్రకవడ గ్రామాలతో పాటు జిల్లా కేంద్రం నుంచి పట్టణ కూలీలు పల్లెలకు పరుగులు తీస్తున్నారు. కిలో పత్తిని ఏరేందుకు రూ.8నుంచి రూ.10వరకు చెల్లిస్తూ.. అదనంగా ఆటో చార్జీలను చెల్లిస్తున్నారు. సమయానికి కూలీలు దొరక్క పోవడంతోనే పత్తి ఏరేందుకు గత్యంతరం లేక మహారాష్ట్ర కూలీలపై ఆధారపడాల్సి వస్తోందని రైతులు పేర్కొంటున్నారు. అడ్వాన్సులు చెల్లించినా.. చివరి వరకు మహారాష్ట్ర కూలీలు పని చేస్తారో? లేదో?నన్న భయాందోళనకు గురవుతున్నారు. కూలీల కోసం మహారాష్ట్రలో వంద కి.మీ.ల దూరం వరకు వెళ్తున్నారు. సీజన్‌లో కూలీలకు అవసరమైన సౌకర్యాలను కల్పిస్తూ సకాలంలో పంట ఇంటికి చేరే విధంగా జాగ్రత్త పడుతున్నారు.

డిమాండ్‌ను బట్టి కూలి

మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో డిమాండ్‌ను బట్టి కూలిని చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొందరు కిలోల కొద్ది పత్తిని ఏరేందుకు వస్తుండగా.. మరికొందరు గుత్తాగా పత్తిని ఏరే పనులు చేస్తున్నారు. దీంతో రైతులకు అదనంగా ఆర్థికభారం పెరిగిపోతోంది. ఈసారి మాత్రం డిమాండ్‌ను బట్టి రూ.10 వరకు చెల్లించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. గతేడు కిలోకు రూ.7 నుంచి రూ.8 చెల్లించిన రైతులు.. ఈసారి అధికంగా చెల్లిస్తున్నారు. ఈ లెక్కన ఒక్కో కూలీకి రూ.600 నుంచి రూ.800 వరకు కూలిని చెల్లించాల్సి వస్తోంది. దీంతో పాటు కూలీలకు అద్దె ఇళ్లు, వంట సామగ్రి, వినోదం కోసం టీవీలను ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో కుటుంబానికి రూ.30వేల నుంచి రూ.50వేల వరకు అడ్వాన్సు రూపంలో ముట్టచెబుతున్నారు. మహారాష్ట్ర కూలీల కోసం అదనంగా ఆర్థిక భారమైనా.. పండించిన పంట ఇంటికి చేరాలంటే ఇబ్బందులు తప్పడం లేదంటున్నారు. పంట

(మిగతా 6వ పేజీలో...)





ఆదివాసీలకు దుస్తులను పంపిణీ చేస్తున్న కంది శ్రీనివాస్‌రెడ్డి

ఆదివాసీలకు అండగా ప్రభుత్వం

• కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి

ఆదిలాబాద్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఆదివాసీలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఆదిలాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం బేల మండలంలోని మల్కుగూడ, వాడగూడ, దేవుజిగూడ, రంకం, కోనాల, చాంద్‌పల్లి, చప్రాల, పిట్‌గావ్, గణేష్‌పూర్, సదల్‌పూర్ గ్రామాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా దీపావళి పండుగ సందర్భంగా ఆదివాసీ గూడాల్లో జరుపుకునే దండారి ఉత్సవాల్లో పాల్గొని వారికి దుస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీల్లో దీపావళి పండుగ వెలుగును నింపాలన్నారు. వారికి ఆదివాసీ దేవతల ఆశీర్వాదం ఉండాలన్నారు. గత ఎన్నికల్లో ఓటమి పాలైన నిత్యం ప్రజల్లోనే ఉంటానని పేర్కొన్నారు. ఎంతో నియమ నిష్టలతో దండారీ ఉత్సవాలను జరుపుకుంటున్న ఆదివాసీలు.. సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. మునుపెన్నడూ లేనివిధంగా ఆదివాసీ దండారీలకు ప్రభుత్వం రూ.15వేల చొప్పున నగదును అందించడం జరుగుతోందన్నారు. ఆదివాసీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ముఖ్యంగా ఆదివాసీ గ్రామాలకు తాగు, సాగునీటితో పాటు మెరుగైన రవాణా సౌకర్యాన్ని కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అల్లూరి అశోక్‌రెడ్డి, విలాస్, సావాపూరే, రాందాస్ నాక్లె, వామన్‌వాంకడే, సంజయ్ గుండావార్, సుదంరెడ్డి, సామ రూపేష్ రెడ్డి, చంద్రకాంత్, శంకర్ గోక్రె, ప్రభాకర్, ఫైమద్, రాజ్, కరీం, మోబిన్, గులాబ్, గిమ్మ సంతోష్, షకీల్, డేరా కృష్ణారెడ్డి, శంకరయ్య, ఆయా గ్రామాల పటేళ్లు, తదితరులు పాల్గొన్నారు.



వాగ్దారిలో దండారీ ఉత్సవాల్లో ఆడే గజేందర్

ప్రతీ దండారి గ్రామానికి రూ.15వేల ఆర్థిక సహాయం : ఆడె

నేరడిగొండ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గంలోని ప్రతీ దండారి గ్రామానికి ఉత్సవాలకు రూ.15వేల ఆర్థికసాయం అందిస్తోందని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ అన్నారు. త్వరలో నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లు అర్హులైన నిరుపేదలకు పక్కా ప్రణాళికతో ఇళ్లు మంజూరు చేయిస్తామన్నారు. దండారి ఉత్సవంలో భాగంగా నేరడిగొండ మండలంలోని వాగ్ధారి, ఇసురుగూడ గ్రామాల్లో దండారి ఉత్సవాల్లో పాల్గొన్నారు. గ్రామస్థులు గుస్సాడి-నృత్యాలతో సాంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికి గ్రామస్థులు ఆయనను శాలువాతో సన్మానించారు. ఆడే గజేందర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ దండారీ గ్రామానికి రూ.15వేల ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు ఆడే వసంతరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, సిరిచెల్మ ఉపసర్పంచ్ అబ్దుల్‌అజీమ్, మాజీ సర్పంచ్‌లు మండాడి గంగారాం, మురళీ, మాజీ ఎంపీటీసీ మారుతి, నాయకులు యాదవ్ రామారావు, సోయం సురేందర్, రమేష్, లక్ష్మణ్, గణేష్, గ్రామపటేళ్లు, మహాజన్, తదితరులు ఉన్నారు.

సంస్కృతీ, సంప్రదాయాలను మరవద్దు

• ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ • సాత్మోరీలో ఏత్మాసూర్ దేవతకు ప్రత్యేక పూజలు • కొనసాగుతున్న దండారీ ఉత్సవాలు



ఏత్మాసూర్ దేవతకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్



పూనగూడకు వచ్చిన బోరిగమ్మ ఆదివాసీ గిరిజనులు

సిరికొండ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తరతరాలుగా ఆచరిస్తున్న సంస్కృతీ, సంప్రదాయాలను మరవొద్దని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని సాత్మోరీ, బోరింగ్ గూడ గ్రామాలలో దండారీ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ముందుగా సాత్మోరీ గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు ఆదివాసీలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏత్మాసూర్ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదివాసీల సంస్కృతీ, సంప్రదాయాలు చాలా గొప్పవని అన్నారు. ప్రకృతిని దైవంగా భావించి పూజలు చేయడం తరతరాలుగా వస్తున్న ఆచారమని తెలిపారు. దండారీ ఉత్సవాలలో డీజేలు పెట్టొద్దని సూచించారు. అకాడి పండుగ నుంచి మొదలుకుని దీపావళి పండుగ వరకు ఆదివాసీలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే పండుగ దండారీ అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దండారీ ఉత్సవాలకు రూ.కోటీ 50 లక్షలు మంజూరు చేసిందని అన్నారు. ఐటీడీఏ పరిధిలోని వెయ్యి గ్రామాల్లో ప్రతీ దండారీ బృందానికి రూ.15 వేల చొప్పున అందిస్తామన్నారు. దండారీ ఉత్సవాలకు నిధులు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డికి, జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్కకు ఆదివాసీల తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్థులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.



• పార్డీ(కె)లో నృత్యాలు చేస్తున్న పాటోజా మరకగూడ గ్రామం గుస్సాడీలు

• బోరిగామ నుంచి పునగూడకు గుస్సాడీ బృందం

తలమడుగు(ఆంధ్రజ్యోతి): నేటి శాస్త్ర సాంకేతిక యుగంలోనూ సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడుకుంటూ ముందుకు సాగుతున్నారు ఆదివాసీ గిరిజనులు. దీపావళి పండుగకు ఆదివాసీ గూడెంల్లో గుస్సాడీ సందడి మొదలైంది. తరాల నుంచి వస్తున్న సంప్రదాయాన్ని భావితరాలకు అందించడంలో గిరిజనులే ముందు వరుసలో ఉన్నారు. దీపావళి పండుగను పురస్కరించుకుని మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివాసీ గిరిజనులు సంప్రదాయ నృత్యాలను, గుస్సాడీలను భక్తి శ్రద్ధలతో ఆటపాటలతో ప్రారంభించారు. కాగా, మండలంలోని పూనాగూడ గ్రామంలో దండారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని మాలే బోరిగావ్ గ్రామానికి చెందిన ఆదివాసీలు పూనగూడ గ్రామానికి రాగా.. వారికి గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. అనంతరం దండారి ఉత్సవాల్లో పాల్గొనగా.. వారు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా బోరిగావ్ గ్రామానికి చెందిన ఆర్క సీతారాం మాట్లా డుతూ దండారి సంప్రదాయ ఉత్సవాలను తమ పెద్దలు తమకు అందించారని, వాటిని ఆచరిస్తూ రాబోయే తరాలకు తెలిసేలా, ప్రతియేడు ఒక గ్రామం మరోక గ్రామానికి అదిత్యం ఇస్తూ వస్తున్నామని, ఈ ఉత్సవాల ద్వారా గ్రామాల సత్సంబంధాలు పెరుగుతాయని, నియమ నిష్ఠలతో నిర్వహించే దండారి ఉత్సవాలు అందరూ సుభిక్షంగా ఉండాలని దేవతను ఆరాధిస్తూ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకుడు జ్ఞానేశ్వర్, కుమ్ర గంగాధర్, సీడం లక్ష్మణ్, కుమ్ర భాస్కర్, కోవా భీమ్రావు, కుమ్ర చత్రపతి, చెడ్మకి రామ్ పటేల్, జంగు, తదితరులు పాల్గొన్నారు.

• అలరించిన మహారాష్ట్ర గుస్సాడీలు

బోథ్(ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్డీ(కె) గ్రామంలో మంగళవారం మహారాష్ట్రలోని పాటోజా మర్కగూడ గ్రామానికి చెందిన దండారి కార్యక్రమంలో భాగంగా గుస్సాడీ వేశాల్లో వచ్చి నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా వారు చేసిన గుస్సాడీ నృత్యం ఆకట్టుకుంది. వచ్చిన గుస్సాడీలను పార్డీ(కె) గ్రామస్థులు సాదరంగా ఆహ్వానించి భోజన వసతులు ఏర్పాటు చేశారు.

బీజేపీ పాలిత ప్రాంతాల్లోనే రైతులకు ధర కల్పిస్తారా?

• ఎంపీ, ఎమ్మెల్యేలు రైతు సమస్యల పరిష్కారంలో విఫలం : జోగు

ఆదిలాబాద్ అర్బన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ రంగ సంస్థ అయిన సీసీఐ కమర్షియల్ పర్చేస్‌లో వస్తే రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. మంగళవారం పత్తికి మద్దతుధర పెంచాలని కోరుతూ సీసీఐ మేనేజర్ ఆద్యామిశ్రాను కలిసి వినతిపత్రం అందజేశారు. పలు విషయాలపై చర్చించి గుజరాత్ పత్తి కంటే ఆదిలాబాద్ పత్తి ఎందులో తక్కువగా ఉందని అడిగారు. ఇక్కడ తక్కువ ధర పెట్టడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయమై సీసీఐ ఎండీని ఫోన్‌లో మాట్లాడి సమస్యను విన్నవించారు. అనంతరం జోగు రామన్న మాట్లాడుతూ ఈనెల 25న పత్తి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయన్నారు. అదే సమయంలో ఎమ్మెల్యే పార్టీ సమావేశాల పేరిట దుమ్మా కొడుతున్నారని, అన్నదాతలు రోడ్డెక్కితే రాత్రికి వచ్చి ధరను నిర్ణయించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కలెక్టర్‌తో పాటు అధికారులు, రైతులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జరగాల్సిన సమావేశాలను ఎందుకు నిర్వహించ లేదని, ముందస్తు ప్రణాళికలతో కొనుగోళ్లు జరుపలేదని మండిపడ్డారు. వ్యాపారస్థులతో ఒప్పందం కుదుర్చుకుని రైతులను నిండా ముంచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కమర్షియల్ పర్చేస్‌ను ప్రారంభించాలని కోరితే కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు లేవంటూ అధికారులు సమాధానం ఇస్తున్నారని అన్నారు. రైతులకు కనీస మద్దతుధర అందించక పోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రోకండ్ల రమేష్, నర్సింగ్, ప్రహ్లాద్, జగదీశ్, గంగయ్య, కుమ్ర రాజు, అప్కం గంగయ్య, పరమేశ్వర్, పురుషోత్తం, సలీం, తదితరులు పాల్గొన్నారు.



సీసీఐ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

జిల్లాలో 4,58,338 మంది ఓటర్లు

ఆదిలాబాద్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 4లక్షల 58వేల 338 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా ఓటర్ జాబితాను విడుదల చేశారు. ఇందులో భాగంగా ఆదిలాబాద్ నియోజకవర్గంలో పురుషులు లక్షా 20వేల 382 కాగా.. మహిళలు లక్షా 25వేల 855 అలాగే, ఆరుగురు ఇతరులు ఉన్నారు. మొత్తం 2లక్షల 46వేల 243 మంది ఓటర్లు ఉన్నారు. అలాగే ఎన్‌ఆర్ఐ ఓటర్లు 14 మంది, సర్వీస్ ఓటర్లు 248 మంది ఉన్నారు. బోథ్ నియోజక వర్గంలో మొత్తం ఓటర్ల సంఖ్య 2లక్షల 12వేల 95 కాగా ఇందులో పురుషులు లక్షా 2వేల 794, మహిళలు లక్షా 9వేల 299 మంది ఉన్నారు. కాగా మరో ఇద్దరు ఇతరులు, మొత్తం 2లక్షల 12వేల 95 మంది ఓటర్లు ఉండగా సర్వీసు ఓటర్లు 583 మంది ఉన్నారు. అక్టోబరు 29 నుంచి నవంబర్ 28 వరకు ఓటరు జాబితా పై అభ్యంతరాలు స్వీకరిస్తారు. అలాగే కొత్తగా ఓటరు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తారు. ఓటరు నమోదుకై నవంబర్ 9, 10 తేదీలలో ప్రతి పోలింగ్ స్టేషన్‌నందు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేయనున్నారు. డిసెంబర్ 24లోగా అభ్యంతరాలను పూర్తి స్థాయిలో పరిష్కరించి జనవరి 6, 2025న తుది ఓటరు జాబితాను విడుదల చేయడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాజార్షిషా తెలిపారు.

ఉత్తమ ప్రదర్శనతో మెడల్స్ సాధించాలి

• క్రీడోత్సవాల ముగింపులో కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్ రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జనవరిలో ఇంటర్ సొసైటీ పోటీల్లో క్రీడాకారులు ఉత్తమ ప్రదర్శన కనబర్చి మెడల్స్ సాధించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆకాంక్షించారు. మూడు రోజులుగా పట్టణంలోని ఎంజేపీ బాలికల గురుకుల కళాశాలలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-14, అండర్-17 క్రీడోత్సవాల ముగింపు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కాగా, జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై గెలుపొందిన జట్లకు మెమొంటోలు అందించారు. ముందుగా కలెక్టర్ బ్యాండ్ మేళా మధ్య ఘన స్వాగతం పలికారు. అనంతరం సరస్వతితోపాటు మహనీయుల చిత్రపటాలకు పూజలు చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిబా పూలే గురుకులాల విద్యార్థులు చదువుతో పాటు క్రీడాల్లో రాణించడం హర్షనీయమన్నారు. జిల్లాస్థాయిలో రాణించిన క్రీడాకారులు జోనల్, రాష్ట్ర స్థాయితో పాటు ఇంటర్ సొసైటీ పోటీల్లో కూడా ప్రతిభ చాటాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆ దిశగా విద్యార్థులకు తయారు చేసేలా పీఈటీలు ప్రత్యేకశ్రద్ధ వహించాలన్నారు. ఆటల ద్వారా శరీరక, మానసికంగా ఉత్సహంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఆర్‌సీవో గోపిచంద్, గురుకులం ప్రిన్సిపాల్ కీర్తి పాల్గొన్నారు.

ఖాళీ అవుతున్న ఆశ్రమ పాఠశాలలు!

• దండారీ ఉత్సవాలకు తరలివెళ్తున్న హాస్టల్ విద్యార్థులు

బోథ్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో గల గిరిజన గూడెంల్లో ఆదివాసీ గిరిజనలు దండారి ఉత్సవాలలో నిమగ్నమయ్యారు. వారం రోజుల పాటు జరిగే ఉత్సవాలను జరుపుకునేందుకు గిరిజనులంతా తమ పొలం పనులకు స్వస్తి పలికి మరీ వేడుకల్లో నిమగ్నమవుతారు. అయితే ఆదివాసీ గ్రామాలలో జరిగే గుస్సాడి ఉత్సవాలను తిలకించేందుకు గ్రామాల్లో రాత్రీపగలు ప్రజలు తరలివస్తారు. గుస్సాడీ నృత్యాలను చూసేందుకు ఆదివాసీ విద్యార్థులు తమ హాస్టల్‌లో నుంచి తరలివెళుతున్నారు. దీంతో గిరిజన పాఠశాలలు ఖాళీ అవుతున్నాయి. ప్రతియేటా ప్రభుత్వం సెలవులు ప్రకటించగా.. ఈ ఏడాది సెలవులు ప్రకటించకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు హాస్టల్‌కు వచ్చి మరీ.. బాలలను వారివారి గ్రామాలకు తీసుకు వెళుతున్నారు. దీంతో హాస్టళ్లు వెలవెలబోతున్నాయి.

మార్కెట్‌కు దీపకాంతులు!

• నేరడిగొండలో ఆకట్టుకుంటున్న అందాల ప్రమిదలు • వివిధ డిజైన్‌లలో మట్టి దీపాలు • డిజైన్లను బట్టి ధరలు

7

